# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# మోహం

న్యూయార్క్ జె.ఎఫ్.కె ఎయిర్ పోర్ట్ ఎప్పట్లాగే రద్దీగానే ఉంది. బేగ్ తీసుకొని బయటకు నడుస్తున్న నాకు ముందు నడుస్తున్న వారిలో ఆమె కనిపించారు ఒక్క క్షణం పాటు.

"అమృత గారేనా?" అనుకుంటూ మరో సారి చూడడానికి ప్రయత్నించాను జనం మధ్యలోంచి.

ముందు కనిపించినది ఆవిడ వజ్రపు ముక్కుపుడక, చాలా ప్రత్యేకమైనది అది.. నేను మరెక్కడా చూడలేదు అలాంటిది

“మేం! అమృతా మేం! “ పిలిచాను.

అందరూ చూస్తారని తెలుసు అయినా ‘ఆవిడ వెళ్ళిపోతుందేమో!’ అన్న ఆత్రుతతో. ఆవిడ మొదట వినలేదు.

తర్వాత తల తిప్పి వెనక్కి చూసింది.

మా ఇద్దరి మధ్యా దూరం మరీ ఎక్కువ లేదు. చలికనుకుంటా పెద్ద స్వెటర్ వేసుకుని, పైన స్కల్ కాప్ పెట్టుకున్నారు. ముఖాన ఎప్పటిలాగే కుంకుమరంగులో పొడవైన నిలువు బొట్టు. సూదిగా కొనతేరినట్టుండే ముక్కున ఆ పెద్ద తెల్లరాయి ముక్కుపుడక.

ఆవిడ చూశారని నేను గమనించగానే పరుగున నడిచాను ఆవిడ దగ్గరకి..

“ఎలా ఉన్నారు? ఎన్నాళ్ళయింది మనం కలిసి? న్యూయార్క్ లో ఎలా? “లాంటి ప్రశ్నలెన్నో గబ గబా వేశేశాను

ఆ తర్వాత గమనించాను పక్కనే ఆయన కూడా ఉన్నారని. ఆయనతో నాకెక్కువ పరిచయం లేదు, నాలుగైదు సార్లు కలిసి ఉంటాను.

'నమస్తే అండీ, బావున్నారా?" అంటూ ఆయన్ని పలకరించాను.

ఆయన చిరునవ్వుతో తల ఊపారు.

ఆవిడ నన్ను దగ్గరగా తీసుకుని “ ఎలా ఉన్నారు మీరా? మీరూ ఇక్కడే ఉంటారా? మా అమ్మాయి ఆషా న్యూ జెర్సీ లో ఉంటుంది. తన దగ్గరకే వచ్చాము “ అన్నారు..

“ఓ అలాగా? మేము జెర్సీలోనే ఉంటాము. మా ఇంటికి తప్పక రావాలి, నాకు తెలీదు, ఆషా ఇక్కడ ఉంటుందని.” అన్నాను.

“మీరు కూడా యూ.ఎస్ మూవ్ అయ్యారని తెలుసు కాని ఎక్కడ అనేది తెలీలేదు” అన్నారు.

మరో నాలుగైదు నిమిషాల కబుర్ల తర్వాత సామాన్లు తీసుకుని బయటకి నడిచాము. వాళ్ళ అమ్మాయి వచ్చి ఎదురుచూస్తోంది అప్పటికే. నన్ను కూడా తనే దింపేస్తానంది. వాళ్ళు మా ఇల్లు చూసినట్టుటుంది, ఆషాకి తర్వాత వాళ్ళని తీసుకురావడానికి బావుంటుందని, నేను కూడా ‘సరే’ అన్నాను.

చలి బాగా ఉంది. పొగడపూలు రాలినట్టు ఉండుండి మంచు పడుతోంది. ఆవిడ సీట్లో మునగదీసుకుని కూర్చున్నారు, తలమీదనించి షాల్ కప్పుకుని మరీ..

“బాగా అలసి పోయినట్టున్నారు! ” అన్నాను నేను. నవ్వారు.

ఆయన ముందు సీట్లో కూర్చుని మౌనంగా రోడ్ల వైపు చూస్తున్నారు.

అప్పుడప్పుడు ‘అవును’,’ కాదు’ తప్ప మరేమీ మాట్లాడకుండా.

------------------

మేము అమెరికా రాకముందు బెంగుళూరులో ఉండేటపుడు పరిచయం అమృత గారితో.

‘అమృతాసుభాష్’ అనే పేరుతో అందరికీ తెలిసిన ఆవిడ పూర్తి పేరు అమృతవర్షిణి. పేరున్న కర్నాటక సంగీత టీచర్.

మా కొలీగ్ కొడుకు అప్పటికే ఆవిడ దగ్గర ఐదారేళ్ళుగా నేర్చుకుంటున్నాడని, చాలా బాగా చెప్తారు అని ఆవిడ ద్వారా తెలుసుకునే మా పాపని అక్కడ చేర్చడానికి తీసుకువెళ్ళాను.

అదే మొదటిసారి చూడడం ఆవిడని.

చూడగానే ఆకట్టుకునే రూపం ఆవిడది. సూటిగా ఉండే కళ్ళు, కొనదేలిన ముక్కు దానిమీద మెరిసే పెద్ద ముక్కుపుడక..చెవులకి లోలకులు లేదా బుట్టలు.. నుదుటిన పొడవుగా నటి భానుమతి పెట్టుకునే లాంటి బొట్టు..

ఇవన్నీ ఒక ఎత్తైతే ఆవిడ జుట్టు మరొక ఎత్తు. నల్లగా పట్టుదారాల్లా మెరిసిపోతూ నడుముదాటి కిందవరకూ ఉండేది.

సంగీత పాఠాలు నేర్పే విషయం లో చాలా స్ట్రిక్ట్ అని ఆవిడకి ముందే పేరు.

' నేనొక స్వరం అంటాను, ఈరోజు కొత్తగా చేరుతున్నవాళ్ళందరూ దాన్ని నా వెనకే అనండి." అంటూ మొదటిగా ‘సరిగమ పదనిస, సనిదప మగరిస’ అంటూ పాడారు.

నాలుగైదేళ్ళనుంచి, పదేళ్ళదాకా ఉన్న కొత్త పిల్లలందరూ వాళ్ళ శక్తి కొద్దీ విన్నదాన్ని తిరిగి పాడారు.

ఒకరిద్దరిని బావుందనీ, మరికొందరిని పరవాలేదని చెప్తూ. ఒక అబ్బాయిది మాత్రం ' ఇతనికేమీ వచ్చే లా లేదని, అయినా వదిలెయ్యడం తన లక్షణం కాదు కనక ప్రయత్నిద్దాం 'అని చెప్పారు.

ఆపైన 'నేను క్లాస్ మిస్ చేస్తే, ఎప్పుడో ఒకప్పుడు తిరిగి తీసుకుని నెలకు ఎనిమిది క్లాస్ లు అయ్యేలా చూస్తాను, మీరు మిస్ అయితే మాత్రం నా బాధ్యత లేదు' అని ఖచ్చితంగా చెప్పేశారు..

రెండు విషయాలు ఖచ్చితంగా చెప్పడం మంచిదే కానీ ఎందుకో ఈవిడ కొద్దిగా నెమ్మదిగా చెప్పి ఉండవచ్చు అనిపించింది నాకు. ముఖ్యంగా ఆ పిల్లాడి విషయంలో.అదే మాట మా సహోద్యోగితో అంటే ' ఆవిడ తీరే అంత, దాన్ని పెద్దగా పట్టించుకోనక్కరలేదు' అంటూ నవ్వేసిందావిడ.

అమృతగారికి ముఖ్యమైనవి మూడు విషయాలు. ఇంట్లో వంటకీ, ఇంటిపనికీ మనిషి ఉంది కనక ఆ శ్రమ లేదు.

ఆవిడ సంగీతం, కేశ సంరక్షణ తర్వాత సంఘసేవ.

వారానికి మూడురోజులు క్లాస్ లు, అప్పుడప్పుడు కచేరీలు ఆవిడకి ఎంతో ముఖ్యమైన వ్యాపకం.

ఆ తర్వాత ఆవిడ కేశ సంరక్షణ. తన జుట్టుని ఎంతో జాగ్రత్తగా, ప్రాణం కంటే ఎక్కువగా చూసుకునే వారు. రోజు విడిచి రోజూ ఏదో ఒక మిశ్రమాన్ని తలకి పట్టించుకోవడం, క్రమం తప్పకుండా మసాజ్ లు చేయించుకోవడం, ఎప్పుడూ పోషణనిచ్చే పదార్థాలని తన భోజనంలో ఉండేలా చూసుకోవడం, ఇలా ఆవిడ మెలకువగా ఉన్న సమయంలో చాలా భాగం దానికే కేటాయించేవారు. ఒక్క వెంట్రుక రాలినా, తెగినా తన ప్రాణమే పోయిందన్నంతగా బాధపడేవారు. వెంటనే ఏదో ఒకటి చేసేవరకూ ఆవిడకి నిద్ర పట్టేది కాదు.

తన దగ్గరకొచ్చే ఆడపిల్లలకి కూడా ఎప్పుడూ బాదం పప్పులు, ప్రోటీన్లు ఉన్న ఆహారం తీసుకోమని, రోజూ పాలు తాగమని చెప్తూ ఉండేవారు. మూడోది, అతి ముఖ్యమైనది ఆవిడ,సుభాష్ గారు కలిసి ఒక అనాధాశ్రమాన్ని స్వంతంగా నిర్వహించేవారు. అనాధ శిశువుల ఆలనా, పాలన చూడడం, వారికి కావలసిన వైద్యం అందేలా చూడడం, ఇష్టమైనవారికి చట్టప్రకారం దత్తత తీసుకునే కార్యక్రమాలు నిర్వహించడం వారి పని.

దానివల్ల అప్పుడప్పుడు ఆవిడకి పోలీసుల దగ్గరనించి ఫోన్ లు వస్తూ ఉండేవి. ఎక్కడైనా అనాధ పిల్లలు కనిపిస్తే ఆ పరిధిలో ఉన్న ఆశ్రమాలకి ఫోన్ చేసి చెప్పేవారు. ఆవిడ దానికి వెంటనే స్పందించి వెళ్ళి, గుడి మెట్ల దగ్గరో, పోలీస్ స్టేషన్ల దగ్గరలోనో మరీ అన్యాయంగా ప్లాస్టిక్ బాగ్ ల్లో పెట్టి చెత్తకుండీల దగ్గరో వదిలేసే ఆ పసిపిల్లల్ని ముఖ్యంగా ఆడపిల్లలని తెచ్చి ఇద్దరు ఆయాల సహాయంతో ఎంతో ప్రేమగా చూసుకునేవారు, వారు దత్తుకు వెళ్ళేంతవరకూ.

ఇలాంటి పనుల మీద వెళ్ళినప్పుడు ఆవిడ క్లాస్ కేన్సిల్ చెయ్యవలసి వచ్చేది, కానీ ఆ తర్వాత ఎప్పుడో ఒకప్పుడు చెప్పేవారు ఆ క్లాస్ ని.. కానీ కొందరికి అది నచ్చేది కాదు, ఆవిడకి వీలుంటే చాలా? మన వీలు కూడా చూడాలి కదా.. మరీ డిక్టేటర్ లా ప్రవర్తిస్తే ఎలా? అనేవారు. ఆ క్రమంలో అది నచ్చక మానిపించేసినవారున్నారు. అయినా ఆవిడేమీ లెక్కపెట్టేవారు కాదు. 'మీ ఇష్టం!' అనేవారు అంతే.

సుభాష్ గారి ఉద్యోగం లో కాంపు లు కూడా ఎక్కువే ఉండడం వల్ల అమృతగారే ఎక్కువగా ఈ వ్యవహారాలన్నీ చూసుకునేవారు.

"సంగీతం మనసుకి తృప్తి

ఈ సేవ ఆత్మ సంతృప్తి

మధ్యలో ఈ జుట్టంటేనే మోహం, వ్యామోహం.. వదలలేకపోతున్నా!" అంటూ నవ్వేవారు..

"ఉన్నదాన్ని జాగ్రత్తగా చూసుకుంటే తప్పేముంది? మంచిదేకదా, మీరు కనక అంత శ్రద్ధగా చేసుకొస్తున్నారు అన్ని పనులూ!" అనేవాళ్ళం మేమంతా తరచుగా..

మా పాప సిరి 'అటతాళ వర్ణం' దగ్గరకు వచ్చేవరకూ శ్రద్ధగా నేర్చుకుంది.

ఆవిడ కోప్పడినా, క్లాస్ మానేసినా ఏమీ అనేది కాదు. ఎంతో ఇష్టం ఆవిడంటే దానికి.

ఆవిడ కూడా 'ఒక్కసారి చెప్తే చాలు, పదే పదే చెప్పక్కర్లేదు సిరికి, ఇలాగే నేర్చుకుంటే వచ్చే సంవత్సరం నాతో పాటు కచేరీలో పాడిస్తాను!' అనేవారు.

కానీ అది జరగనే లేదు.

అనుకోకుండా మావారికి వచ్చిన ప్రాజెక్ట్ పని మీద మేము అమెరికా రావలసి వచ్చింది.

‘ స్కైప్ లో నేర్పిస్తానుగా’ అన్నారు కన్నీళ్ళు పెట్టుకున్న సిరితో.

కొన్నాళ్ళు నడిచినా, సిరి స్కూల్, ఇతర క్లాస్ లు, ఆవిడ పనుల వల్ల అవి కుంటుపడి ఈ మధ్యన పూర్తిగా ఆగిపోయాయి.

మొదట్లో ఫోన్ కాల్స్, ఆ తర్వాత మెసేజ్ లు గా మారి ఈ మధ్యన చాలా రోజులుగా ఆవిడతో టచ్ లో లేననే చెప్పాలి. అందుకే ఇన్నాళ్ళకి ఆవిడనిలా చూడడం చాలా సంతోషంగా అనిపించింది. నేను దారిపొడుగునా ఏవో కబుర్లు చెప్తూనో, చెప్పడానికి ప్రయత్నిస్తూనో ఉన్నాను.. ఆవిడ ‘ఊ, ఆ ‘అంటున్నారు, మధ్యలో ‘అప్పుడలా, ఇప్పుడిలా’ అంటున్నారు కానీ నిద్రకి ఆగలేనట్టుగా ఉన్నారు. అది గమనించి నేను మాటలు తగ్గించాను..

మరో పావుగంటకి మా ఇల్లు చేరాం.

' ఇప్పుడే వచ్చారు, అలసి పోయారు కనక కొన్నాళ్ళాగి తీసుకొస్తాను ' అంది ఆషా.

నేను కూడా ఆ అమ్మాయి చెప్పింది సబబుగానే ఉంది కనక – త్వరలోనే రావాలని, కనీసం ఒక రాత్రైనా ఉండాలని మాట, వాళ్ళ ఫోన్ నంబర్లూ తీసుకుని వీడ్కోలు చెప్పి పంపాను..

రెండు రోజుల ఆఫీస్ పని మీద వెళ్ళిన ప్రయాణం, ఇల్లంతా రణరంగం. ఎక్కడ మొదలు పెట్టాలో చూసుకుని ఓ కప్పు కాఫీ తాగి రెండు గంటల్లో ఓ కొలిక్కి తెచ్చాను.

ఫ్రిజ్ లో ఉన్నవి చూసుకుని రెండు గ్లాస్ లు అన్నం పెట్టి స్నానం చేసి వచ్చేసరికి పిల్లలు, అతుల్ రావడానికి మరో పావుగంట టైముంది.

సోఫాలో వాలి కళ్ళు మూసుకున్నాను. పొద్దున్నే లేచానేమో కళ్ళమీదకి కూరుకుని వస్తోంది నిద్ర.

‘ఆవిడని ఇంత డల్ గా చూడలేదు ఎప్పుడూ.అంతగా అలసిపోయారా? వయసు కూడా అరవై దాటిఉంటుంది అంతే..ఆలోచనలు మళ్ళీ అమృతగారి వైపే.

ఒక్క తెల్ల వెంట్రుక కనబడినా నచ్చేది కాదు ఆవిడకి. చాలా బాగా మెయింటెయిన్ చేసుకునేవారు. జుట్టు చివర్లు అందంగా కనిపించాలంటే క్రమంతప్పకుండా కొసలు కత్తిరించుకోవాలి అనేవారు. కానీ అది చేయించుకోవడానికి వెళ్ళిన ప్రతీసారీ ఆవిడ విపరీతంగా బాధపడేవారు.

'చెప్పాను అప్పడికీ వాడికి. ఒక్క ఇంచ్ కన్నా తక్కువ కట్ చెయ్యద్దని, అయినా వినరు.. చూడండి. ఇప్పుడిది పెరగాలంటే ఎన్నాళ్ళు పడుతుందో?' అనేవారు..

‘పెరుగుతుందిగా మమ్మీ, అంత బాధ పడతావేం?’ అంటూ నవ్వేది వాళ్ళ పాప ఆషా..

" కత్తిరించుకు తిరిగేదానివి నీకేం తెలుసు నా బాధ?" అని పోట్లాడేవారీవిడ.

అందుకే ఆ బాధ, అక్కర్లేని ఎటాచ్ మెంట్ వద్దనే నేను హాయిగా నాక్కావలసిన రీతిలో కట్ చేయించుకుంటూ ఉంటాను అనేది ఆ పిల్ల. ఇందాకా పొట్టి జుట్టులో ఉన్న ఆషా ని చూసినప్పుడు అదే గుర్తు వచ్చింది నాకు. కళ్ళు మూత పడేంతలో వచ్చారు ముగ్గురూ.. హడావిడి మొదలు..

అమృతగారు కొద్దిగా వెనక్కి వెళ్ళారు ఆ కాసేపు..

ఆ తర్వాత నా దైనందిన జీవితంలో పడిపోయాను. అయినా ఆ వారంలో రెండు సార్లు ఆషాకి ఫోన్ చేశాను. ముందు వద్దని మొహమాటపడి, తన భర్త లేరనీ, తాము ముగ్గురూ శనివారం భోజనానికి వస్తామని, ఆపైన తను, సుభాష్ గారు ఇంటికి వచ్చేస్తాం, అమ్మ ఉంటానంటే రాత్రి అక్కడ ఉంటుందని చెప్పింది. సిరి కి చెప్తే చాలా సంతోషపడింది..

‘టీచర్ తో కలిసి మళ్ళీ పాడతాను, స్కైప్ లో పాఠాలు మళ్ళీ చెప్పించుకుంటాను’ అని సంబరపడింది. నేనూ, అదీ కలిసి ఇల్లంతా సర్దాం. ఏం వండాలో ఎంపిక చేసుకుని శ్రద్ధగా వండాము, అన్నీ అమర్చాము. అంతకు ముందే మా ఇద్దరికీ జరిగిన చర్చలో ముఖ్యమైనది. ఆవిడకేం ఇవ్వాలి? అని. అనేకరకాలు ఆలోచించిన పిమ్మట సిరి కోరిక మేరకు ఆవిడకి ఈ మధ్యనే మార్కెట్ లోకి వచ్చిన బెస్ట్ హెయిర్ కేర్ ప్రోడక్ట్ గా పేరుతెచ్చుకున్న కేశ సౌందర్య సాధనాల కిట్ ఒకటి కొందామని నిర్ణయించుకున్నాం..

'ఎస్, షి విల్ లవ్ ఇట్..!' అంది పదిహేనేళ్ళ సిరి..దాంతో పాటు మంచి దువ్వెన్నలు, హెయిర్ బ్రష్ ల సెట్ కూడా కొందామన్న సలహా అందించింది. అవన్నీ నిన్ననే కొనుక్కొచ్చి చక్కని కేన్ బాస్కెట్ లో అమర్చి, పైన పలచని గిఫ్ట్ రేపింగ్ బట్ట కప్పి, ఆపైన అలంకారాలన్నీ చేసి తయారుగా ఉంచాము. సుభాష్ గారికి ఒక సెంట్ సీసా, ఆషాకి రెండు పూల మొక్కలు కొన్నాము. మా ఎంపికకి మేమే సంబరపడిపోయాం.

శనివారం మధ్యాహ్నం వచ్చారు.

కబుర్లు టీ అవీ అయ్యాకా, అందరం లివింగ్ రూం లో కూర్చున్నాం. వచ్చినప్పటికంటే బావున్నారావిడ. ఇంట్లోకి వచ్చాకా పెద్ద కోట్ తీసేసి చిన్న స్వెటర్, చేతుల గ్లవ్స్, చిన్న సాక్స్ ఉంచుకున్నారు. అలాగే తలకున్న టోపీ..

"చెవులు, చేతి, కాలి వేళ్ళు చలికి బాగా ఎఫెక్ట్ అవుతాయి కదా!" అన్నారు.

"నిజమే, చూడండి, టెంపరేచర్ పెంచమంటే పెంచుతాను" అన్నాను..

ఎక్కడనించి వెతికి తెచ్చుకుందో సిరి తన బెంగుళూరు మ్యూజిక్ పుస్తకాలు తెచ్చేసుకుంది..

ఆవిడ పక్కనే కూర్చుని, 'మీరు రాసినవే ఇవన్నీ!' అంటూ చూపిస్తుంటే దాని కళ్ళల్లో అమితమైన సంతోషం..

కబుర్లతో భోజనాలు కానిచ్చాం. తొమ్మిదవుతుండగా 'ఇంక మేము బయలుదేరతాం' అంటూ లేచారు.

' మాం, మీరు ఈ ఒక్కరాత్రి ఉండిపోండి, ప్లీజ్" అంటూ సిరి నాలుగుసార్లు అడిగింది. దాంతో ఆవిడకి సరే అనక తప్పలేదు..

'మర్నాడు నేను తీసుకొచ్చి దింపు తాను' అని చెప్పాను ఆషాకి.

సరే అని తల్లికి ' బై ' చెప్పి వెళ్ళింది ఆషా, వెనకే సుభాష్ గారు. మేము లివింగ్ రూం లో ఫైర్ ప్లేస్ ముందరే మరో గంట కూర్చున్నాం, బాబు అతుల్ వెళ్ళి పడుకున్నాక. సిరి, అమృత గారు ఒకటి రెండు వర్ణాలు, ఒక కృతి పాడారు కలిసి..

ఆ తర్వాత ' ఇంక పడుకుందామా?" అంటూ లేచారావిడ.

'మీరు సిరి రూం పక్కనున్న గెస్ట్ రూం లో పడుకోవచ్చు, లేదా మీ శిష్యురాలితో రూం పంచుకుంటానన్నా సరే. మీ ఇష్టం' అన్నాను నేను..

' గెస్ట్ రూం లో పడుకోనా?' అన్నారావిడ.

ఆవిడకన్నీ చూపించి గుడ్ నైట్ చెప్పి వచ్చాము.

మర్నాడు పొద్దున్నే లేచాను..

" ఆరయిందేమో? అంతే ఆదివారమేగా కాసేపు పడుకో! "అన్నారు అతుల్.

"డికాక్షన్ వేసి వచ్చి పడుకుంటా. అమృతగారు కూడా ఉన్నారు కదా, ఆవిడ త్వరగా కాఫీ తాగుతారేమో!" అంటూ కిందకి వచ్చాను.

చివరి రెండు మెట్లు దిగనే లేదు నేను.

అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి అవాక్కయిపోయాను. అక్కడే నిలబడిపోయాను..

హాల్లో కార్పెట్ మీద కూర్చుని ధ్యానం చేసుకుంటున్నారు అమృత గారు. ఎప్పుడు లేచారో తెలీదు కానీ చాలాసేపటినించి అలా కూర్చున్నట్టుగా ఆవిడ భంగిమ చెప్తోంది. అది కాదు నేను చూస్తున్నది. టోపీ లేని ఆవిడ తలని. చిన్నగా, తలకి అతి దగ్గరగా 'బాయ్ కట్' గా కట్ చేసి ఉన్న ఆవిడ తెల్ల జుట్టుని.

క్షణం సేపు అలాగే ఉండి పోయాను. ఏదో నమ్మలేని విషయాన్ని చూస్తున్నట్టుగా ఉంది..

'ఎక్కడ జలపాతంలాంటి ఆ జుట్టు, ఇదేవిటి ఇది' ఏమయింది?' అనుకున్నాను బాధగా.

ఆవిడకి శబ్దం రాకుండా నెమ్మదిగా వంటగదిలోకి వెళ్ళి డికాక్షన్ వేసి వచ్చేసరికి ఆవిడ అరచేతుల్ని రుద్దుకుని ఆ వేడిని కళ్ళమీద ఉంచుకుంటున్నారు. మరో పది నిమిషాలకి చేతిలో పొగలు కక్కుతున్న కాఫీ కప్పులతో కూర్చున్నాం. నా ఆశ్చర్యాన్ని గమనించినట్టు ఆవిడే చెప్పారు..

"బ్రెస్ట్ కేన్సర్ మీరా, తెలిసేసరికి కొద్దిగా లేటే అయింది.. ఆపరేషన్ తప్పనిసరి. కీమో థెరపీ తో పాటు రేడియేషన్. అన్నీ ఇక్కడే న్యూయార్క్ లోనే అయ్యాయి. మీకు తెలుసుకదా నేను ఫైటర్ ని.. ప్రస్తుతానికి బాగానే కోలుకుంటున్నాను. జయించాననే అనుకుంటున్నాను..

ఇంకా కొద్ది కాలం పడుతుందిట.. నేను పూర్తిగా 'కేన్సర్ ఫ్రీ' అని చెప్పడానికి. జయించాననే అనుకుంటున్నాను.. కేన్సర్ ని కాదు.. నా మోహాన్ని..తెలుసుకున్నాను ఏదీ శాశ్వతం కాదని. ఇదిగో చూడండి! " అంటూ తన జుట్టువైపు వేలుపెట్టి చూపించిన ఆవిడ కళ్ళల్లో సన్నటి తడి రేఖ..

Click here to share your comments on this story